సాక్షి
వైఎస్సార్ జిల్లా

శనివారం । 14 । అక్టోబర్ । 2023



'అనంత' విజయం

కడప నగరంలోని కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో అనంతపురం జట్టు విజయం సాధించింది.

-10లో



రేషన్ బియ్యం పట్టివేత

మైదుకూరులో గూడ్స్ వాహనంలో తరలిస్తున్న 70 బస్తాల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

-10లో

గరిష్టం/కనిష్టం
36.0 /26.5

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 26.5 - 36.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

116 మందికి పీజీటీలుగా పదోన్నతి



మాట్లాడుతున్న ఆర్‌జేడీ వెంకట క్రిష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్: రాయలసీమ పరిధిలోని మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న 116 మందికి ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్(టిజిటి) నుంచి పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్స్ (పిజిటి)గా పదోన్నతి కల్పించినట్లు పాఠశాల విద్య ఆర్‌జేడీ వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. కడపలోని గాంధీనగర్ ఉన్నత పాఠశాలలో జోన్-4 పరిధిలో పనిచేస్తున్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు పదోన్నతి కలిప్పించేందుకు కౌన్సిలింగ్‌ను నిర్వహించారు.

కానిస్టేబుల్, హోంగార్డుల సస్పెండ్

కడప అర్బన్: పోలీస్ శాఖలో అక్రమాలకు, అవినీతికి పాల్పడే సిబ్బందిపై జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ కొరడా ఝుళిపిస్తున్నారు. ఓ వ్యక్తిని బెదిరించి.. బలవంతపు వసూళ్లకు పాల్పడినట్లు తెలియడంతో పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ బి.నరసింహారెడ్డి (పి.సి..2737), హోంగార్డు జి.రవికుమార్(హెచ్‌జి 600)లపై క్రిమినల్ కేసు నమోదు చేయడంతోపాటు విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఎస్పీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో అలసత్వం వహించినా, అక్రమ వ్యవహారాలకు పాల్పడినా చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

నూతన నియామకం





గుండ్లకుంట శ్రీరాములు షేక్ అల్లా బకాష్

కడప వైఎస్ఆర్ సర్కిల్: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులను ఆ పార్టీ అధిష్టానం శుక్రవారం ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీ వైఎస్ఆర్ జిల్లా అధ్యక్షుడిగా గుండ్లకుంట శ్రీరాములు, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా షేక్ అల్లా బకాష్‌ను నియమించింది. రాష్ట్ర కమిటీలోనూ జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు కల్పించారు. ఏపీ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా షేక్ నజీర్ అహ్మద్, బండి జకరయ్యను నియమించారు.

కడప జోన్‌కు 684 ప్రత్యేక బస్సులు

కడప కోటిరెడ్డిసర్కిల్: దసరా పండగ సందర్భంగా కడప జోన్ నుంచి వివిధ ప్రాంతాలకు 684 ప్రత్యేక బస్సులు నడపుతున్నామని కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వర రావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, కర్నూలు, నంద్యాల, శ్రీసత్యసాయి, తిరుపతి, వైఎస్సార్ జిల్లా నుంచి హైదరాబాద్‌కు 279, విజయవాడకు 60, చెన్నైకు 67, బెంగుళూరుకు 177, ఇతర ప్రాంతాలకు 101 బస్సులు చొప్పున నడుపుతున్నట్లు ఆయన తెలిపారు. అనంతపురం జిల్లా నుంచి 95, అన్నమయ్య జిల్లా 29, చిత్తూరు నుంచి 33, కర్నూలు నుంచి 86, నంద్యాల నుంచి 70, సత్యసాయి నుంచి 60, తిరుపతి నుంచి 200, వైఎస్సార్ జిల్లా నుంచి 111 బస్సులు సాధారణ ఛార్జీలతో నడపనున్నామని వివరించారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

కడప రూరల్: జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులు జోరుగా జరుగుతున్నాయి. శుక్రవారం 22 ప్రాంతాల్లో ఈ క్యాంపులు నిర్వహించారు. పెండ్లిమర్రి మండలం రంపతాడు గ్రామంలో జరిగిన వైద్య శిబిరంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. కాశినాయన మండలం ఇటుకలపాడులో ఎంఎల్‌సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ మిగిలిన ప్రాంతాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రిమ్స్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ

కడప అర్బన్: విశాఖపట్నంలో నిర్వహించిన అనస్థీషియా రాష్ట్ర సదస్సులో కడప ప్రభుత్వ వైద్య కళాశాల(రిమ్స్) పీజీ విద్యార్థులు డాక్టర్ ఎస్.మౌనిక, డాక్టర్ సంధ్యారాణి ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సురేఖ తెలిపారు. పోస్టర్ ప్రెజెంటేషన్‌లో మోనిక ప్రథమం, బోధనా శాస్త్ర, క్విజ్‌లో ద్వితీయ, తృతీయ స్థానాల్లో సంధ్యారాణి నిలిచారన్నారు. ఈ సందర్భంగా ఇద్దరినీ ప్రిన్సిపల్ అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ సునీల్ చిరువెళ్ల, డాక్టర్ రాఘవేంద్ర ప్రసాద్, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ భారతి, డాక్టర్ మంజు, డాక్టర్ చైతన్య పాల్గొన్నారు.

దేవీ పూజకు వేళాయె

తెలుగు వారు పది రోజులపాటు అట్టహాసంగా నిర్వహించే దసరా వేడుకలు, పూజల గురించి అనుకుంటే.. ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్సార్ జిల్లాలో వెంటనే గుర్తుకు వచ్చేది పినాకిని నది ఒడ్డున ఉన్న కన్యకా పరమేశ్వరీ దేవాలయం. మైసూరు తర్వాత అంతటి ప్రఖ్యాతిగాంచిన ప్రొద్దుటూరు ఆలయం దసరా ఉత్సవాలకు సిద్ధమైంది.

- 15 నుంచి వైభవంగా దసరా ఉత్సవాలు
- నాగపూర్ కళాకారులతో సుహాగ్ బ్యాండ్
- విజయదశమి రోజున బిందెసేవ, శక్తి వేషాలు



అలంకారాలు
15న రాజరాజేశ్వరిదేవి
16న భవానీదేవి
17న అన్నపూర్ణాదేవి
18న గజలక్ష్మీదేవి
19న పార్వతీదేవి
20న సరస్వతీదేవి
21న గాయత్రీదేవి
22న మహిషాసురమర్దిని
23న విజయలక్ష్మి
24న వసంతోత్సవం

ప్రొద్దుటూరులోని అమ్మవారిశాల (ఇన్‌సెట్) వజ్రపు చీర అలంకరణలో అమ్మవారు

ప్రొద్దుటూరు కల్చరల్: ప్రొద్దుటూరు వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో ఆర్య వైశ్య సభ ఆధ్వర్యంలో ఏడాదికేడాది విజయ దశమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు అన్ని కులాలు, మతాల భక్తులు తరలివస్తారు. గ్రానైట్ రాయితో ఆలయం గర్భగుడి మనోహరంగా తీర్చిదిద్దారు. మూల విరాట్‌ను పుత్తడి ఆభరణాలు, వజ్రపు చీర, వజ్ర కిరీటం, బంగారు చీరతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తారు. గర్భగుడికి వెండి తొడుగులను అమర్చడమేగాక, అమ్మవారికి బంగారంతో చేసిన రథం, వెండి ఊయల, అద్దాల మండపం ఏర్పాటు చేస్తారు. దేవీ జన్మ వృత్తాంతం తెలిపే చిత్రపటాలు దర్శనమిస్తాయి.

ఆలయ చరిత్ర:

1890లో నిర్మించిన ఈ ఆలయంలో ఎత్తైన గాలి గోపురం, చక్కని శిల్పకళా నైపుణ్యంతో పట్టణానికి శోభ చేకూర్చే విధంగా గాలి గోపురం దర్శనమిస్తాయి. అపురూపమైన శిల్ప సంపద కలిగిన ముఖద్వార మండపం మనోహరమైన దృశ్యాల సమ్మేళనం. పర్లపాడు గ్రామానికి చెందిన వ్యాపారి కామిశెట్టి చిన్న కొండయ్యకు కలలో కనిపించిన కన్యకా పరమేశ్వరి "పెనుగొండ వాసినైన నేను కడప జిల్లా పినాకిని నదికి ఉత్తర దిక్కున ఉన్న ప్రొద్దుటూరు పట్టణంలో కొలువు తీరనున్నా.. నాకు ఆలయం నిర్మించాలి' అని చెప్పడంతో 130 ఏళ్ల కిందట వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయం నిర్మించారు. 1895 నుంచి దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు. 1929లో జాతిపిత మహాత్మా గాంధీ ఈ ఆలయాన్ని సందర్శించినట్లు చెబుతారు. కంచి కామకోటి పీఠాధిపతి చంద్రశేఖర సరస్వతి, జయేంద్ర సరస్వతిలు ఆలయంలో 40 రోజుల పాటు యజ్ఞయాగాదులు నిర్వహించారు.

133వ దసరా ఉత్సవాలు: కన్యకా పరమేశ్వరి ఆలయంలో 133వ శరన్నవరాత్రి వేడుకలను 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నారు. నవరాత్రుల్లో ఒక్కో రోజున ఒక్కో అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు.

వైభవంగా దసరా ఉత్సవాలు



ఆహ్వాన పత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో 133వ దసరా ఉత్సవాలు ఆదివారం నుంచి ఈ నెల 24వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్‌రావు, కార్యదర్శి మురికి సుబ్రహ్మణ్యం తెలిపారు. అమ్మవారి శాలలో ఉత్సవ ఆహ్వాన పత్రాలను శుక్రవారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రోజూ లోక కల్యాణార్థం చతుర్వేద పారాయణం, జప హోమాలు, విశేష అభిషేకాలు, అర్చన, బంగారు శ్రీచక్రానికి విశేష పూజలు నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం 102 మంది అమ్మవారిశాల నుంచి శివాలయం చేరుకుని నవగంగతీర్థాలు, నగరేశ్వరస్వామి ఆలయం నుంచి వాసవీపురాణాన్ని తీసుకువచ్చే వేడుక ఉంటుందన్నారు. నాగ్‌పూర్‌కు చెందిన 40 మంది కళాకారులతో సుహాగ్ బ్యాండ్ ఆకర్షణగా నిలుస్తుందన్నారు. కలకత్తా తరహాలో ప్రత్యేక పందిరి ఏర్పాటు చేశామన్నారు. కదిలే ఆంజనేయ స్వామి బొమ్మల సెట్టింగ్, బిందెసేవ రోజు కేరళ వారిచే శక్తివేషాలు, చక్కభజన, రేలారే రేలా, తొట్టిమెరవణికి స్పెషల్‌గా క్రాకర్స్ భక్తులను ఆకట్టుకుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జొన్నలగడ్డ రవీంద్రబాబు, మిట్టా శంకర్‌బాబు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు: ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

ప్రొద్దుటూరు క్రైం: ప్రొద్దుటూరులో జరిగే దేవీ నవరాత్రి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ తెలిపారు. ఏఎస్పీ ప్రేరణాకుమార్‌తో కలిసి శుక్రవారం ఆలయ ప్రొద్దుటూరులో ఎస్పీ విస్తృతంగా పర్యటించారు. అమ్మవారిశాల, చెన్నకేశవస్వామి ఆలయం, రాజరాజేశ్వరి ఆలయం, కొర్రపాడు రోడ్డులోని జమ్మి చెట్టు, ఎగ్జిబిషన్ ప్రాంతాలను సందర్శించారు. పోలీసు అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూసుకోవాలన్నారు. మహిళలకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



శివాలయం సెంటర్‌లో సూచనలిస్తున్న ఎస్పీ

అధ్యాపక సంఘం ఎన్నికలపై అనాసక్తి

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం అధ్యాపక సంఘం(యూటా) నూతన కార్యవర్గం ఏర్పాటుకు స్పందన కొరవడుతోంది. ఎన్నికల ప్రక్రియ ఆరంభమైనా ఒక్క నామినేషన్ దాఖలు కాకపోవడంతో యూటా ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. ఈ నెల 7వ తేదీన వైవీయూ అధ్యాపక సంఘం ఎన్నికలకు నోటిఫికేషన్ జారీచేశారు. అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షులు, జాయింట్ సెక్రటరీ, కోశాధికారితో పాటు మొత్తం 8 రకాల పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 13వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం ఉన్నా.. ఒక్క నామినేషన్ దాఖలు కాలేదు. విశ్వవిద్యాలయం ఏర్పాటు నుంచి వైవీయూ అధ్యాపక సంఘం చురుగ్గా పనిచేస్తూ పలు సమస్యలను ప్రభుత్వం, వైవీయూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లింది. అంతటి ప్రాధాన్యం కలిగిన యూటా ఇపుడు స్పందించడం లేదు. దీంతో ఏకగ్రీవంగానైనా నూతన కార్యవర్గం ఏర్పాటు చేయాలని యోగివేమన విశ్వవిద్యాలయం అధ్యాపక వర్గాలు భావిస్తున్నాయి.

పిల్లల సమగ్రాభివృద్ధికి కృషి

కడప ఎడ్యుకేషన్: అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలల్లో 3-6 ఏళ్ల వయస్సుగల పిల్లల సమగ్రాభివృద్ధికి కృషి చేసేలా శిక్షణ ఇస్తున్నామని పాఠశాల విద్య ఆర్‌జేడీ వెంకటక్రిష్ణారెడ్డి, డీఈఓ రాఘవరెడ్డి, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నగర శివారులోని గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో అంగన్ వాడీ సీడీపీవోలు, సూపర్ వైజర్లు, ఉపాధ్యాయులకు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచే పిల్లలను అన్ని రకాలుగా సంసిద్ధం చేయాలన్నారు. అనంతరం శిక్షణ అంశాలను డీఆర్‌ల ద్వారా తెలుసుకున్నారు. అలాగే సంసిద్ధతా మేళా ఏర్పాటు చేసి ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర నోడల్ ఆఫీసర్ సత్యనారాయణ, వాణిశ్రీ, ఏఎంఓ ధనలక్ష్మి, రామాంజనేయులు, చంద్ర ఓబుల్‌రెడ్డి, శోభారాణి, శ్రీహరి, నాగేశ్వరావు, సౌభాగ్యమ్మ, మదాలస, వరలక్ష్మి పాల్గొన్నారు.

కడప గడపలో హ్యాండ్‌బాల్ సమరం



సాధన చేస్తున్న జిల్లా క్రీడాకారిణులు

- నేటి నుంచి డీఎస్ఏ క్రీడా మైదానంలో పోటీలు
- వివిధ జిల్లాల నుంచి 550 మంది క్రీడాకారుల రాక

కడప స్పోర్ట్స్: కడప గడపలో హ్యాండ్‌బాల్ సమరం నేడు ప్రారంభం కానుంది. పెద్ద ఎత్తున క్రీడాకారులు వివిధ జిల్లాల నుంచి వచ్చి తమ ప్రతిభను నిరూపించుకోనున్నారు. నగరంలోని డీఎస్ఏ క్రీడా మైదానం ఇందుకు వేదికగా మారింది. రాష్ట్ర విభజన తర్వాత వైఎస్ఆర్ కడప జిల్లాలో తొలిసారి నిర్వహిస్తున్న ఏపీ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్-2023కు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 14వ తేదీ నుంచి 16వతేదీ వరకు ఈ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. సీనియర్ ఉమెన్, అండర్-19 మెన్ విభాగాల్లో నిర్వహించే ఈ పోటీలకు 550 మంది వరకు క్రీడాకారులు, మేనేజర్లు, కోచ్‌లు, టెక్నికల్ అఫిషియల్స్, సిబ్బంది హాజరుకానున్నారు.


క్రీడాకారులకు తగిన వసతి: పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు తగిన వసతి, భోజనం ఏర్పాటు చేసినట్లు వైఎస్ఆర్ కడప జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు లయన్ కె.చిన్నపరెడ్డి, కార్యదర్శి ఎ.సింధూరి, వి.వి. శివప్రసాద్, తదితరులు వెల్లడించారు. ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. లి రోజున క్రీడలను ఘనంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. రెండోరోజు ఆదివారం మ్యాచ్‌ల అనంతరం రాత్రి క్యాంప్ ఫైర్ నిర్వహించనున్నారు. మూడో రోజున విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందన్నారు. ఈ పోటీల ప్రారంభోత్సవానికి ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజద్ బాషా హాజరవుతున్నట్లు తెలిపారు.

జిల్లా క్రీడాకారుల సాధన..

రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహిస్తున్న నేపథ్యంలో సొంత జిల్లాలో విజయ కేతనం ఎగురవేయాలని వైఎస్సార్ కడప జిల్లా సీనియర్ మహిళల జట్టు, అండర్-19 బాలుర విభాగం జట్టు సాధన చేస్తున్నారు. 15 రోజులుగా కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో శిక్షణ పొందుతున్నారు.

టీడీపీ డీలా...!

- చంద్రబాబు అరెస్ట్ పరిణామాలపై తెలుగు తమ్ముళ్ల అంతర్మథనం
- జిల్లాలో పార్టీని నడిపించే నాయకుడు కరవు
- ఎవరికీ వారే ఏకరువు... భరోసా ఇచ్చే నేత ఏదీ!?
- ఉమ్మడి జిల్లాలో అస్తవ్యస్తంగా తెలుగుదేశం



సాక్షి ప్రతినిధి, కడప: పూర్వపు వైభవాన్ని గణనీయంగా కోల్పోయిన టీడీపీ ఉమ్మడి కడప జిల్లాలో బతికి బట్ట కట్టే పరిస్థితి కన్పించలేదు. తిరిగి పునఃప్రతిష్ట పొందాలనే వ్యూహంతో ఉన్నా, అధ్యక్షుడు చంద్రబాబునాయుడు అరెస్టు పరిణామం ఆ పార్టీ శ్రేణులను ఆందోళనకు గురిచేస్తోంది. పార్టీని ఏకతాటిపై నడిపించే నాయకత్వం లేకపోవడం స్పష్టంగా కన్పిస్తోంది. ఉనికి చాటుకునే చర్యలు మినహా ప్రత్యక్ష పోరాటం చేసే పరిస్థితి కన్పించడంలేదు. అపార ప్రజా మద్దతున్న వైఎస్సార్‌సీపీని ధీటుగా ఎదుర్కొనే సత్తా లేకపోవడంతో తెలుగుదేశం పార్టీ డీలా పడుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత జిల్లాలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉంది. అన్ని నియోజక వర్గాల్లోనూ ఆ పార్టీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సొంత జిల్లాపై సీఎం సైతం ప్రత్యేక దృష్టి సారిస్తుండడం, అపార పారిశ్రామికవృద్ధి కోసం విశేష చొరవ చూపడంతో ప్రజా మద్దతు బలంగా ఉంది. ముందే అత్తెసరు పోరాటంతో వ్యవహరించే టీడీపీకి అధినేత చంద్రబాబు అరెస్టుతో స్తబ్దత ఆవహించింది. కలిసికట్టుగా పార్టీని నడిపిస్తారని భావిస్తే ఎవరికీ వారే పెద్దగా వ్యవహరిస్తూ ఒకరిపై మరొకరు ఆధిపత్యం సాధించేందుకే నిమగ్నమైనట్లు పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

స్పష్టంగా కన్పిస్తోన్న నాయకత్వపు లోటు...

తెలుగుదేశం పార్టీకి ఎన్నికల ముందు ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయన్న ఆందోళన వ్యక్తమవుతున్న తరుణంలో పార్టీని నడిపించే నాయకత్వం కరవైంది. నేతలదరి సమన్వయంతో ఒక్కతాటిపై నడిపించే సామర్థ్యం కలిగిన బలమైన నాయకుడు ఆ పార్టీకి కరవయ్యారనే చెప్పాలి. గతంలో దివంగత నేతలు బిజివేముల వీరారెడ్డి, గుండ్లకుంట శివారెడ్డి లాంటి వారు జిల్లాలో ఏ సమస్య ఎదురైనా ముందుండి పోరాడేవారు. పార్టీలో నేతల మధ్య విభేదాలు ఏర్పడినా.. అధిష్టానం వరకూ వెళ్లకుండానే వీలైనంత వరకు ఇక్కడే పరిష్కరించేవారు. ఇప్పుడు టీడీపీలో ఆ పరిస్థితి లేదు. నాయకులు ఎవరికి వారుగా ఉంటున్నారు. జిల్లాలో స్థాయి కల్గిన నాయకుడు లేకపోవడమే అతిపెద్ద లోటుగా రాజకీయ విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. వెరశి మెజార్టీ నియోజకవర్గాలు అంతర్గత కుమ్ములాటలకు వేదికగా నిలుస్తున్నాయి.

ఉనికి కోసం ఆరాటం....

ఉమ్మడి జిల్లాలో రైల్వేకోడూరు, రాజంపేట, రాయచోటి, ప్రొద్దుటూరు, కడప, మైదుకూరు నియోజకవర్గాల్లో తెలుగు తమ్ముళ్లు ఎవరికీ వారే ఉనికి కోసం పోటీ పడుతున్నారు. ప్రొద్దుటూరులో ఇన్‌ఛార్జి ప్రవీణ్‌తోపాటు ఇరువురు మాజీ ఎమ్మెల్యేలు వరదరాజులురెడ్డి, లింగారెడ్డిలతోపాటు పోట్లదుర్తి సురేష్‌నాయుడు నాయకత్వం కోసం ఆరాటపడుతున్నారు. మైదుకూరులో పార్టీ ఆవిర్భావం నుంచి అంటిపెట్టుకొని ఉన్న రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ వేరు కుంపట్లు పెట్టుకున్నారు. కడపలో సీనియర్ నేతలు ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి, అమీర్‌బాబు, దుర్గాప్రసాద్‌లు పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులురెడ్డి ఆధిపత్యాన్ని సహించలేకున్నారు. వెరశి వేరు వేరుగా ప్రణాళికలు చేసుకుంటున్నారు. రాయచోటిలో మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, సుగవాసీ ప్రసాద్‌బాబు ఎవరికీ వారుగా ఉంటున్నారు. రైల్వేకోడూరులో ఇన్‌ఛార్జి విశ్వనాథనాయుడు, నరసింహప్రసాద్‌లదీ ఆదే పరిస్థితి. రాజంపేటలో బత్యాల చెంగల్‌రాయుడు, నరసింహరాజు, మేడా విజయ్‌శేఖర్‌రెడ్డిలు ఉనికి కోసం ఆరాటపడుతున్నారు. ఇది చాలదన్నట్లు గంటా నరహరి సైతం తెరపైకి వస్తున్నారు. ఆయా నియోజక వర్గాల్లో ఒకరు చేపట్టే కార్యక్రమాలను మరొకరు సమర్థించకపోగా, వ్యతిరేకిస్తూ అభాసుపాలవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల మధ్య అపార ప్రజామద్దతున్న వైఎస్సార్‌సీపీకి ఎదుర్కొవడం అసాధ్యమేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.


పట్టాలు తప్పిన రైల్వే జంక్షన్లు.!

- పేరుకే పెద్ద.. వసతుల్లో చిన్న
- ఎర్రగుంట్ల, కడప, ఓబులవారిపల్లెలో ఆగని కొన్ని రైళ్లు
- ఇతర ప్రాంతాల జంక్షన్లతో పోలికేలేని వైనం

రాజంపేట : రైల్వే జంక్షన్లు అభివృద్ధిలో పట్టాలు తప్పాయి. హోదా ఘనం.. ప్రగతిలో హీనంగా మారాయి. సాదాసీదా స్టేషన్లుగానే మిగిలిపోయాయి. ముంబయి-చెన్నై రైల్వే మార్గంలోని గుత్తి-రేణిగుంట మధ్య మూడింటిని జంక్షన్ స్టేషన్‌లుగా గుర్తించారు. కడప, ఎర్రగుంట్ల, ఓబులవారిపల్లె రైల్వేస్టేషన్లను దక్షిణ మధ్య రైల్వే ఇటీవల జంక్షన్‌లుగా ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే పేరుకు మాత్రమే జంక్షన్‌స్టేషన్లుగా నిలిచిపోయాయి. కేవలం ప్రకటనతో మమా అనిపించారు. ఇతర ప్రాంతాల వాటితో అభివృద్ధితో పోలికే లేకుండా పోయింది. కొన్ని రైళ్లు కూడా ఆగడం లేదు.

రైలు మార్గాల అనుసంధానతతో..

రైల్వేబడ్జెట్ మేరకు 1996-1997లో ప్రారంభమైన ఎర్రగుంట్ల-నంద్యాల రైలుమార్గంతో ఎర్రగుంట్లను జంక్షన్‌గా గుర్తించారు. 2008-2009లో కడప -బెంగళూరు రైలుమార్గం ఏర్పాటైంది. ఈ మార్గంతో కడప రైల్వేస్టేషన్ జంక్షన్‌గా ఏర్పడింది. 2005-2006లో కృష్ణపట్నం-ఓబులవారిపల్లె రైలుమార్గం ఏర్పాటైంది. ఓబులవారిపల్లె రైల్వేస్టేషన్.. కృష్ణపట్నం రైలుమార్గానికి అనుసంధానత (కనెక్టివిటి) స్టేషన్ కావడంతో జంక్షన్‌గా గుర్తించారు.



అభివృద్ధికి నోచుకోని కడప రైల్వేస్టేషన్

అటకెక్కిన కడప రీడెవలప్‌మెంట్

ఎయిర్‌పోర్టును తలిపించేలా రైల్వేస్టేషన్లను రీ డెవలప్‌మెంట్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా కడప రైల్వేస్టేషన్‌ను రీడెవలప్‌మెంట్ చేసేందుకు గతంలో రైల్వేశాఖ నిర్ణయించింది. ఆ తర్వాత అటకెక్కించింది. ఏ కేటగిరిలో కడప రైల్వేస్టేషన్ ఉంది. విశాలమైన ప్లాట్‌ఫాంలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆధునిక సౌకర్యాల లేమి కనిపిస్తోంది. రీడెవలప్‌మెంట్ వెనక్కి వెళ్లిపోయిందనే విమర్శలు ఉన్నాయి. మరోవైపు కడప-బెంగళూరు రైలు మార్గ అనుసంధానంతో జంక్షన్‌గా ఉన్నప్పటికీ.. ఆ స్థాయిలో అభివృద్ధి కనిపించడం లేదు.

కాలుష్యకోరల నుంచి విముక్తేదీ?

ఎర్రగుంట్ల రైల్వే జంక్షన్‌ను కాలుష్య కోరల్లో నుంచి విముక్తి కల్పించే దిశగా రైల్వే శాఖ ఎటువంటి ప్రయత్నాలు చేయలేదు. పైగా ఇప్పుడు లోకోరన్నింగ్‌స్టాఫ్ క్రూసెంటర్ ఏర్పాటు చేశారు. దాని నిర్వహణ కూడా విఫలమైందని రన్నింగ్‌స్టాఫ్ వర్గాలే పెదవి విరుస్తున్నాయి. డివిజన్ అధికారుల అనాలోచిత నిర్ణయాల వల్ల అనవసర వ్యయంతో రైల్వేకి భారీగా నష్టం కలిగించారు. ఈ స్టేషన్‌ను అభివృద్ధి చేసే పరిస్థితులు కనుచూపు మేరలో కనిపించడం లేదు. స్థల లేమి సమస్య ఓ వైపు పీడిస్తోంది.

గ్రామీణ స్టేషన్‌గానే ఓబులవారిపల్లె

ఓబులవారిపల్లె జంక్షన్ నేటికీ గ్రామీణ రైల్వేస్టేషన్‌గానే కొనసాగుతోందన్న విమర్శలు ఉన్నాయి. కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్స్ లేవు. పైగా స్టేషన్ ఔటరు నుంచి విజయవాడ డివిజన్ పరిధిలోకి వెళ్లిపోయింది. కేవలం స్టేషన్ మాత్రమే గుంతకల్ డివిజన్‌లో ఉంది. జంక్షన్ కాగానే స్టేషన్ రూపురేఖలు మారిపోతాయని ఇక్కడి ప్రాంతీయులు భావించారు. అయితే కలగానే మిగిలిపోయింది.

అభివృద్ధి చేయాలి



ఓబులవారిపల్లె రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఆ దిశగా రైల్వేబోర్డు యోచించాలి. ఈ విషయాన్ని ఎంపీ మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తాను. అన్ని రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని కోరుతాను. ఇప్పటికీ ఎంపీ రైల్వే సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నారు.

-కొరముట్ల శ్రీనివాసులు, ఎమ్మెల్యే, రైల్వేకోడూరు

కేంద్రం దృష్టి సారించాలి



కడప రైల్వేస్టేషన్ అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించాలి. అధునాతన సౌకర్యాలు కలిప్పించాలి. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కడప రైల్వేల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఇప్పటికే పలు మార్లు రైల్వే శాఖ మంత్రి, అధికారులను కలిశారు. పేరుకే జంక్షన్‌లా ఉంది. ఎయిర్‌పోర్టులా తీర్చిదిద్దాలి.

-బీహెచ్ ఇలియాస్, డైరెక్టర్, ఏపీఎస్ఆర్టీఎస్, కడప

క్లుప్తంగా

యాత్ర-2 షూటింగ్ సందడి


సన్నివేశాలను చిత్రీకరిస్తున్న యూనిట్ సభ్యులు

వేంపల్లె : వేంపల్లెలో యాత్ర-2 సినిమా షూటింగ్ సందర్భంగా సందడి నెలకొంది. శుక్రవారం స్థానిక నాలుగురోడ్ల కూడలి, మెయిన్ బజార్లలో డైరెక్టర్ మహి వి రాఘవ్ ఆధ్వర్యంలో సన్నివేశాలు చిత్రీకరించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల బహిరంగ సమావేశాల్లో ఇచ్చిన హామీలు వంటి సన్నివేశాలను షూటింగ్ చేశారు. చంద్రబాబు పాత్రలో మహేష్ మంజరేకర్ నటిస్తున్నారు. ఈ షూటింగ్‌ను చూసేందుకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చారు. రెండు రోజుల తర్వాత మమ్ముట్టి పాత్రను చిత్రీకరించనున్నట్లు ప్రొడ్యూసర్ శివ మేక తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడిటర్ శ్రావణ్, కెమెరామెన్లు సంతోష్, నారాయణ, ముదిరాజ్, సెల్వా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని ఆంజనేయస్వామి గుడి సమీపంలో శుక్రవారం ఫ్లయాష్ లారీ ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక శివానగర్‌కు చెందిన షేక్ జమాల్‌వలి తన ద్విచక్ర వాహనంలో నెల్లూరు రోడ్డు నుంచి నాలుగు రోడ్ల కూడలికి వస్తుండగా... నెల్లూరు నుంచి కర్ణాటకకు ఫ్లయాష్‌తో వెళుతున్న లారీ ఢీకొనడంతో జమాల్‌వలి కిందపడిపోయాడు. వెంటనే ఎడమచేతి పైకి లారీ ఎక్కిపోవడంతో చేయి నుజ్జునుజ్జు అయింది. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ఆయనను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న అర్బన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన లారీని స్టేషన్‌కు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం జమాల్‌వలిని కడపకు తరలించారు.

పాయలకుంట్లలో చోరీ

బి.కోడూరు : మండలంలోని పాయలకుంట్ల గ్రామంలోని బొమ్మన లక్ష్మయ్య ఇంటిలో శుక్రవారం గుర్తు తెలియని దుండగులు రూ.50 వేలు, రెండు తులాల బంగారాన్ని చోరీ చేశారు. వీటి విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపారు. బొమ్మన లక్ష్మయ్యతోపాటు కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం తన కూతురుని చేసేందుకు అనంతసాగరం గ్రామానికి వెళ్లి మధ్యాహ్నం 2 గంటలకు తిరిగి పాయలకుంట్ల చేరుకున్నారు. ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగులకొట్టి ఉండటంతో తలుపులు తెరిచి చూశారు. ఇంటిలోని సామాన్లు చెల్లాచెదురుగా ఉండటాన్ని గమనించి ఇంటిలోని నగదు, బంగారంను చూడగా కనిపించలేదు. దీంతో చోరీకి గురైనట్లు వారు నిర్ధారించుకుని బి.కోడూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బి.కోడూరు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరుపై అనంత జయభేరి

కడప జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం

కడప స్పోర్ట్స్ : ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-23 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో అనంతపురం జట్టు విజయం సాధించింది. కడప నగరంలోని కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో మూడో రోజు శుక్రవారం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు.. 19.1 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 103 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని రోహిత్ రోషన్ 36 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్లు సాత్విక్ 1, అఖిల్ 1 వికెట్ తీశారు. కాగా అనంతపురం జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 249 పరుగులు చేయగా, నెల్లూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 200 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 151 పరుగులు చేసిన విషయం తెలిసిందే. దీంతో అనంతపురం జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

కడప, కర్నూలు మధ్య మ్యాచ్‌లో..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 86 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కడప జట్టు 74.3 ఓవర్లలో 225 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని ఆదిల్‌హుస్సేన్ 60 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్లు సాబ్జాన్‌బాషా, మహేంద్ర యాదవ్ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 42 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. జట్టులోని సాయిసూర్యతేజారెడ్డి 100 పరుగులు చేశాడు. కడప బౌలర్లు విజయభవేంద్ర 4, చెన్నారెడ్డి 4 వికెట్లు తీశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా కడప జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 246 పరుగులు చేయగా, కర్నూలు జట్టు 207 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో మ్యాచ్ డ్రాగా ముగియగా, కడప జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది.


క్రికెట్ మ్యాచ్‌లో పోటీ పడుతున్న అనంతపురం, నెల్లూరు జట్లు


సాయిసూర్యతేజారెడ్డి, (100 పరుగులు)


విజయభవేంద్ర, కడప, (4 వికెట్లు)


చెన్నారెడ్డి, కడప, (4 వికెట్లు)

ఏపీ ఎన్‌ఆర్‌టీఎస్ సాయంతో

స్వస్థలానికి జిల్లా వాసి

కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీ ఎన్ఆర్‌జీఎస్) సహకారంతో వైఎస్సార్ జిల్లాకు చెందిన బొగ్గిడి చిన్నపురెడ్డి సురక్షితంగా స్వస్థలానికి చేరాడు. ఏపీ ఎన్‌ఆర్‌టీఎస్ డైరెక్టర్ బీహెచ్ ఇలియాస్, వైఎస్సార్‌సీపీ కువైట్ కన్వీనర్ బాలిరెడ్డి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. సిద్దవటం మండలం మాధవరానికి చెందిన బొగ్గిడి చిన్నపరెడ్డి ఒకటిన్నర ఏడాది కిందట డ్రైవర్ పని నిమిత్తం కువైట్‌కు వెళ్లాడు. మూడు నెలలుగా అతను కిడ్నీ సమస్యతో బాధపడుతుండేవాడు. తనకున్న అనారోగ్య సమస్య నయం చేయాలని స్పాన్సర్‌కు ఎన్నిమార్లు చెప్పినా ఆస్పత్రికి కూడా పంపకుండా వేధించాడు. దీంతో సమస్య తీవ్రమై ఇబ్బంది పడిన చిన్నపరెడ్డి తనను స్వదేశానికి పంపేందుకు సహాయం చేయాలని మాధవరానికి చెందిన పల్లె సుబ్బరామిరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఆయన ఏపీఎన్‌ఆర్‌టీఎస్ రీజినల్ కో ఆర్డినేటర్ మహేష్‌రెడ్డి ద్వారా చిన్నపరెడ్డిని ఎంబసీకి తీసుకెళ్లి వారి సాయంతో లేబర్ కోర్టు ద్వారా స్పాన్సర్ వద్దనుంచి పాస్‌పోర్టు ఇప్పించారు. చిన్నపరెడ్డికి పది రోజులపాటు వసతి, భోజన సౌకర్యాలు కల్పించారు. అతని టిక్కెట్‌కు కువైట్ రెడ్డీస్ అసోసియేషన్ వారు రూ.11 వేలు ఆర్థికసాయం చేశారు. దీంతో ఈనెల 12వ తేది ఇండిగో విమానం ద్వారా స్వదేశానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా చిన్నపరెడ్డి మాట్లాడుతూ విదేశాల్లో ఉన్న తెలుగువారి సమస్యలు పరిష్కరించేందుకు ఏపీ ఎన్‌ఆర్‌టీఎస్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, చైర్మన్ మేడపాటి వెంకట్, సీఈఓ హేమలత, డైరెక్టర్ ఇలియాస్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.


చిన్నపరెడ్డికి టిక్కెట్‌ను అందజేస్తున్న మహేశ్వర్‌రెడ్డి

ప్రమాదానికి కారణమైన డ్రైవర్ అరెస్ట్

జమ్మలమడుగు రూరల్ : ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. కారు గురువారం రాత్రి అతి వేగంగా వచ్చి ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందిన విషయం విదితమే. కారును నిలబెట్టకుండా డ్రైవర్‌తోపాటు మరికొంత మంది సంఘటన స్థలం నుంచి పరారయ్యారు. గురువారం అర్ధరాత్రి ప్రొద్దుటూరు సమీపంలో వాహనం కనపడటంతో స్థానికులు జమ్మలమడుగు పోలీస్ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే పోలీస్ సిబ్బంది వెళ్లి ప్రమాదానికి కారణమైన కారు, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని జమ్మలమడుగు పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. డ్రైవర్ జమ్మలమడుగు మండలంలోని ఆంజనేయపురం గ్రామానికి చెందిన దాసరి సాయి కుమార్‌గా గుర్తించారు. ఇద్దరు వ్యక్తుల దుర్మరణానికి కారణమైన డ్రైవర్‌ను కఠినంగా శిక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడలకు ప్రభుత్వం ప్రోత్సాహం

– అంతర్‌రాష్ట్ర టెన్నికాయిట్ పోటీలు ప్రారంభం

బి.కొత్తకోట : క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ ప్రోత్సహిస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాగొండ ఖలీల్ అన్నారు. శుక్రవారం బి.కొత్తకోటలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అంతర్‌రాష్ట్ర టెన్నికాయిట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాకాలు అందించి అండగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న క్రీడా కార్యక్రమాలు, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని క్రీడాకారులను కోరారు. ఈ పోటీల్లో డబుల్స్‌లో చిత్తూరు నుంచి 10, పలమనేరు నుంచి ఐదు, పెద్దతిప్పసముద్రం మండలం మల్లెల నుంచి ఐదు, బి.కొత్తకోట నుంచి 20 జట్లు పోటీలో పాల్గొంటున్నాయి. కార్యక్రమంలో నిర్వాహకులు కె.మంజునాథ్, చింతల రామాంజి, రమేష్‌నాయుడు, మహేష్, చంద్ర, సంతోష్, బాలాజి, ఆది పాల్గొన్నారు.

నాటుసారా ప్రభావిత ప్రాంతాల తనిఖీ

పులివెందుల రూరల్ : పులివెందుల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో ఉన్న నాటుసారా ప్రభావిత గ్రామాలను కడప జిల్లా ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ ప్రవీణ్ కుమార్ సందర్శించారు. అందులో భాగంగా లింగాల మండలంలోని అంబకపల్లె, పులివెందుల పట్టణంలోని నగరిగుట్ట ప్రాంతాన్ని తనిఖీ చేశారు. నాటుసారా కేసులలో నేరాలు చేసిన వ్యక్తుల ఇళ్లకు వెళ్లి, వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. నాటుసారా తయారీ, కేసులు, కుటుంబ పరిస్థితులు ఇలా పలు విషయాలు వారితో ప్రస్తావించారు. నాటుసారా తయారీ, అమ్మకం, రవాణా వంటి నేరాలు పదే పదే నిర్వహించినచో.. వారి మీద పి.డి చట్టాన్ని ప్రయోగిస్తామని హెచ్చరించారు.

చెక్‌పోస్టు సందర్శన

పులివెందుల మండల పరిధిలో ఉన్న కనంపల్లె పోలీస్ చెక్‌పోస్టును ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ ప్రవీణ్ కుమార్ తనిఖీ చేశారు. అక్కడ పని చేసే సిబ్బందికి పలు సూచనలు చేశారు. తరచుగా కనంపల్లె పోలీస్ చెక్‌పోస్టును పరిశీలిస్తూ ఉండాలని పులివెందుల సీఐ రామాంజనేయులుకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కళ్యాణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ ప్రవీణ్ కుమార్

అదనపు చార్జీలు వసూలు చేస్తే చర్యలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ప్రస్తుతం ఉన్న టిక్కెట్ రేట్లతో మాత్రమే బస్సులు నడపాలని, అదనపు చార్జీలు వసూలు చేస్తే చర్యలు తప్పవని ప్రయివేటు బస్సు యజమానులకు జిల్లా ఉప రవాణా కమిషనర్ ఈ.మీరా ప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం నగర శివార్లలోని ఊటుకూరు ఉప రవాణ శాఖ కార్యాలయంలో దసరా ఉత్సవాలను పురస్కరించుకుని వైఎస్సార్ జిల్లా కాంట్రాక్ట్ క్యారేజీ బస్సుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా సందర్భంగా ప్రయాణికులకు ఏ విధమైన ఇబ్బంది కలగకుండా ప్రస్తుతం ఉన్న టిక్కెట్ రేట్లతో మాత్రమే బస్సులు నడపాలని సూచించారు. టికెట్ రేట్లు పెంచినట్లయితే కేసులు బుక్ చేసి జరిమానా విధించడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎనిమిది ప్రత్యేక తనిఖీ బృందాలు ఏర్పాటు చేసి సీసీ బస్సులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించవలసిందిగా మోటార్ వాహనాలు తనిఖీ అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. వాహన యజమానులు తమ వాహనాల పనులన్నీ వాహన పోర్టల్ ద్వారా మాత్రమే జరుపుకోవాలని తెలిపారు.


మాట్లాడుతున్న జిల్లా ఉప రవాణా కమిషనర్ ఈ.మీరా ప్రసాద్

అర్హులైన రైతులందరికీ డ్రిప్ పరికరాలు

కడప అగ్రికల్చర్ : జిల్లాలో అర్హులైన రైతులందరూ పంట పొలాలకు డ్రిప్ సౌకర్యం ఏర్పాటు చేసుకోవచ్చని ఏపీ ఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడపలోని ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటి సాగు పథక పీడీ కార్యాలయంలో కంపెనీ ప్రతినిధులు, కార్యాలయ సిబ్బందితో డ్రిప్ ఏర్పాటుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు 10,500 హెక్టార్ల లక్ష్యాన్ని నిర్దేశించారన్నారు. ఇందులో ఇప్పటికి 5752 హెక్టార్లలో 4772 మంది రైతులకు కలెక్టర్ చేత పరిపాలన ఉత్తర్వులను అనుమతి పొందడం జరిగిందన్నారు. కంపెనీ ప్రతినిధులు పరికరాల సరఫరాలో కొరత లేకుండా చేయాలని కోరారు. రైతులు కూడా వెంటనే రైతు వాటాను చెల్లించి పరికరాలు పొందాలని సూచించారు. రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్న పంపిణీనే కాకుండా మార్చుకునే అవకాశం రైతు భరోసా కేంద్రాలలో ఉందని వివరించారు. కంపెనీ ప్రతినిధులు రైతులకు పరికరాల నిర్వహణ, పైపుల శుభ్రతపైన సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఐ ఇంజినీర్లు, ఎంఐడీసీలు, జిల్లా కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రవీంద్రనాథరెడ్డి

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి

పులివెందుల రూరల్ : రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని, వ్యవసాయ సర్వీసులు అందించడంలో ఎటువంటి జాప్యం ఉండకూడదని ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు తెలిపారు. శుక్రవారం ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఆయన పులివెందుల డివిజన్ పరిధిలోని పులివెందుల, వేముల, తొండూరు, వేంపల్లె, చక్రాయపేట, లింగాల, సింహాద్రిపురం మండలాల క్షేత్ర స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. క్షేత్రస్థాయి అధికారులు సాధించిన అభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న జగనన్న కాలనీల్లో కొత్త విద్యుత్ సర్వీసులకు నమోదు చేసుకున్న వెంటనే యుద్ధప్రాతిపదికన విడుదల చేయాలన్నారు. ప్రజల నుంచి విద్యుత్‌కు సంబంధించి ఎటువంటి సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన విద్యుత్ పనులను శరవేగంగా పూర్తి చేయాలన్నారు. లక్ష్యాలను గడువులోగా పూర్తి చేసి ఫలితాలు సాధించాలన్నారు. అవసరమైన కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఇస్తున్నప్పటికీ, ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు తగ్గడం లేదన్నారు. పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. క్షేత్రస్థాయిలో పని చేసే ప్రతి ఉద్యోగి సంస్థకు, వినియోగదారులకు వారధిలాగా పని చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరాలో ఎటువంటి జాప్యం చేయవద్దన్నారు. విద్యుత్ ప్రమాదాల నివారణే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించాలన్నారు. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్లు ధర్మాజ్ఞి, గురువయ్య, ఓఎస్‌డీ శ్రీనివాసులు, వైఎస్సార్ జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ రమణ, అకౌంట్ ఆఫీసర్ మధు, ఏడీ శ్రీకాంత్, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు

70 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

మైదుకూరు : మైదుకూరులో శుక్రవారం విజిలెన్స్ అధికారులు 70 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. కడప రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసూం బాషాకు అందిన సమాచారం మేరకు శుక్రవారం విజిలెన్స్ అధికారులు దాడి చేశారు. మైదుకూరులోని ప్రొద్దుటూరు బైపాస్ రోడ్డులో గూడ్స్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అందులో అక్రమంగా రవాణా చేస్తున్న 70 బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యం, వాహనం విలువ రూ.6,34,055 ఉంటాయని విజిలెన్స్ అధికారులు తెలిపారు. బియ్యం, వాహనాన్ని మైదుకూరు అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఇందుకు సంబంధించి మైదుకూరు మండలం శివపురం గ్రామానికి చెందిన శిగమల్ల శ్రీనివాసులు అనే వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్టు విజిలెన్స్ అధికారులు తెలిపారు. దాడిలో విజిలెన్స్ సీఐ ఈదురు బాషా, ఏఓ బాలగంగాధర్‌రెడ్డి, ఎస్.జనార్దన్ రావు, రంతుబాషా, వీఆర్‌ఓ మాధవి ఉన్నారు.


బియ్యం, వాహనంతో విజిలెన్స్ అధికారులు

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా

పోరుమామిళ్ల/కలసపాడు/కాశినాయన : అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని జిల్లా ఎస్పీ సిద్దార్థ్‌కౌశల్ తెలిపారు. ఆయన శుక్రవారం పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన పోలీస్‌స్టేషన్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. పోలీస్ అధికారులకు తగిన సూచనలు, సలహాలు అందించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ దొంగతనాలు అరికట్టేందుకు గస్తీ ముమ్మరం చేయాలని అన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారుల సమన్వయంతో నాటుసారా, అక్రమ మద్యం అరికట్టాలన్నారు. ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, వాహనదారులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పోలీసుస్టేషన్ ఆవరణలో పచ్చదనం పెంపొందించాలని, ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. పోరుమామిళ్లలో విజిలెన్స్ వారు పట్టుకున్న ఓ లారీ స్టేషన్ వెనుకవైపు ఉండటాన్ని పరిశీలించారు. వివరాలు అడిగారు. కలసపాడులో దిశ సెంటర్‌ను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పోరుమామిళ్ల సీఐ చిరంజీవి, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, కలసపాడు ఎస్ఐ నాగమురళి, కాశినాయన ఎస్ఐ హరిప్రసాద్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పోరుమామిళ్లలో సీఐ, ఎస్ఐలతో మాట్లాడుతున్న సిద్దార్థ్ కౌశల్

భార్యను చంపిన కేసులో భర్తకు జీవితఖైదు

మదనపల్లె : భార్యపై అనుమానంతో హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు పడింది. ఈ మేరకు మదనపల్లె రెండో ఏడీజే కోర్టు న్యాయమూర్తి బి.అబ్రహాం తీర్పు చెప్పారని డీఎస్పీ కేశప్ప తెలిపారు. శుక్రవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రామసముద్రం మండలం దిగువబొంపల్లెకు చెందిన రాసింటి కదిరప్ప, కదిరమ్మల కుమార్తె రెడ్డెమ్మను మదనపల్లె మండలం బొమ్మనచెరువు పంచాయతీ టేకులపాళెంకు చెందిన మల్లయ్య కుమారుడు విశ్వనాథ(35)కు ఇచ్చి వివాహం చేశారు. వివాహానంతరం మదనపల్లెలో కాపురం ఉంటూ రెడ్డెమ్మ ఇళ్లలో పనిమనిషిగా, విశ్వనాథ టీషాపులో పని చేసుకుని జీవనం సాగించేవారు. ఈ క్రమంలో విశ్వనాథ తన భార్య రెడ్డెమ్మపై అనుమానం పెంచుకున్నాడు. దీంతో 2015 డిసెంబర్ 15న రెడ్డెమ్మను గొంతు నులిమి, కిరాతకంగా హత్య చేసి మర్రికుంట చెరువులో పడేశాడు. ఈ ఘటనపై రామసముద్రం పోలీసులు కేసుగా నమోదు చేసి విచారణ చేశారు. విశ్వనాథ భార్యను హత్య చేసినట్లుగా దర్యాప్తులో తేలడంతో అదే నెల 21న అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. మదనపల్లె రెండో ఏడీజే కోర్టు న్యాయమూర్తి అబ్రహాం ఈ కేసు తుది విచారణ అనంతరం తీర్పును వెలువరించారు. ఈ కేసుకు సంబంధించి డీఎస్పీ కేశప్ప ఆధ్వర్యంలో సీఐ శివాంజనేయులు, ఎస్ఐ చంద్రశేఖర్, కోర్టు కానిస్టేబుల్ రుద్ర విశేష కృషి చేశారు. నిందితుడికి శిక్ష పడేలా అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్-2 జనార్దనరెడ్డి వాదించారు. మహిళలపై జరిగిన నేరాల్లో త్వరితగతిన నిందితులకు శిక్షలు పడాలన్న డీజీపీ ఆదేశాల మేరకు, ఎస్పీ ఉత్తర్వులతో కోర్టు ట్రయల్స్‌ను వేగంగా పూర్తి చేయిస్తున్నామని డీఎస్పీ తెలిపారు.

టీడీపీ నుంచి వైఎస్ఆర్‌సీపీలో చేరిక


ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన ఇసుకపల్లె గ్రామస్తులు

పెండ్లిమర్రి : మండలంలోని ఇసుకపల్లె గ్రామంలో శుక్రవారం టీడీపీ నుంచి వైఎస్ఆర్‌సీపీలోకి 50 కుటుంబాలు ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి సమక్షంలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వల్లెపు సుబ్బరాయుడు, బత్తల చెంచయ్య, మల్లికార్జున, వెంకటరమణ, పిచ్చయ్య, రెడ్డయ్య, రాజు, శ్రీరాములు, పెద్ద పుల్లయ్య తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షుడు నాగమల్లారెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు రెడ్డయ్య, శివారెడ్డి, కేసిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మునెయ్య, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

పోలీసులతో టీడీపీ శ్రేణుల వాగ్వాదం

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు పట్టణంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఎటువంటి అనుమతులు లేకుండా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తుండటంతో సీఐ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులు, టీడీపీ కార్యకర్తల మధ్య తోపులాట, వాగ్వాదం జరిగింది. దీంతో ఉద్రిక్తత నెలకొంది. టీడీపీ నాయకులు రైల్వేకోడూరు జాతీయ రహదారిపై గుంపులుగా ఏర్పడి విజిల్స్ వేస్తూ వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించారు. అనుమతులు లేకుండా ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేసిన కస్తూరి విశ్వనాథనాయుడు, ఆయన అనుచర టీడీపీ నాయకులు పలువురిపై కేసులు నమోదు చేసినట్టు సీఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

రహదారి కోసం ఘర్షణ

గాలివీడు : మండల పరిధిలోని కొర్లకుంట గ్రామం ఎగువతూపల్లె, దిగువతూపల్లెకు చెందిన వారు రహదారి కోసం ఘర్షణకు దిగిన సంఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఎల్.అమరావతమ్మకు స్వల్పగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలు మరో వర్గంపై మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంటకశివకుమార్ తెలిపారు.

శ్రీ భద్రకాళీ అమ్మవారికి రాహుకాల పూజలు




ప్రత్యేక అలంకరణలో శ్రీ భద్రకాళీ అమ్మవారు, రాహుకాల పూజలు చేస్తున్న మహిళా భక్తులు

రాయచోటి టౌన్ : రాయచోటిలో శ్రీ భద్రకాళీ అమ్మవారికి రాహుకాల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి రంగు రంగుల పూలు, బంగారు ఆభరణాలు, పట్టు వస్త్రాలు, నిమ్మకాయలతో తయారు చేసిన హారాలతో అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ పూజలలో భాగంగా అమ్మవారికి మహిళా భక్తులు నిమ్మకాయలపై ఒత్తులు వెలిగించి హారతులు పట్టారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించడంతోపాటు రాహుకాల పూజ విశేషాలను వివరించి చెప్పారు. ఈ పూజలు ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈవో డివి రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

అఘోర లింగేశ్వరుడికి మాస శివరాత్రి పూజలు

రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారి ఆలయ ఆవరణలో వెలిసిన శ్రీ అఘోర లింగేశ్వరుడికి మాస శివరాత్రి పూజలు ఘనంగా నిర్వహించారు. అభిషేకాలు, పూజలు నిర్వహించిన తరువాత రంగు రంగుల పూలతో అందంగా అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు.